క్లుప్తంగా

మోదీ చిత్రపటం ఏర్పాటు చేయండి

బీజేవైఎం నగర అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి



కార్పొరేషన్‌లో ప్రధాని మోదీ చిత్రపటాన్ని కమిషనర్‌కు అందజేస్తున్న రామకృష్ణారెడ్డి

బడంగ్‌పేట్: అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో తప్పనిసరిగా ప్రధాని మోదీ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని బీజేవైఎం నగర అధ్యక్షుడు రాళ్లగూడం రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ సరస్వతికి ప్రధాని మోదీ చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాల్లో దేశ ప్రధాని మోదీ చిత్రపటాలు లేకపోవడం బాధాకరమన్నారు. అన్ని రాష్ట్రాలతో పాటు తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి, సంక్షేమ కార్యక్రమాలకు కేంద్రం నిధులు కేటాయిస్తుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎక్కడ మోదీ చిత్రపటం లేదో అక్కడ బీజేవైఎం, బీజేపీ ఆధ్వర్యంలో అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చ కార్యదర్శి లాలా సందీప్, సీనియర్ నాయకులు రాజ్‌కుమార్, గోపాల్, సైదులు, జగన్, ప్రవీణ్‌గౌడ్, లక్ష్మణ్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెస్ చార్జీల పెంపుపై హర్షం



స్కూల్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థినులు, నేతలు

కందుకూరు: ప్రజాపాలన విజయోత్సవాలను పురస్కరించుకుని ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నేతలు శనివారం మండలంలోని నేదునూరు మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గం అధ్యక్షుడు అక్కిరెడ్డి దీక్షిత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఆలేటి ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ మండల కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఆర్టీసీలో ఉచిత బస్ ప్రయాణంతో పాటు మెస్ చార్జీలు పెంచడం సంతోషకరమన్నారు. మరోపక్క ఇంటిగ్రేటెడ్ స్కూల్, స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం సీఎం దార్శనికతకు నిదర్శనమని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు వరికుప్పల బాబు, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు శివ, నయీమ్, కార్తీక్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై అవగాహన



పారిశుద్ధ్య పనులు చేపడుతున్న మున్సిపల్ సిబ్బంది

తుక్కుగూడ: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన ప్రజా విజయోత్సవాలు మున్సిపాలిటీ వ్యాప్తంగా శనివారం ఏడో రోజు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా దేవేందర్‌నగర్, మంఖాల్ పారిశ్రామిక వాడ గ్రామంలో పరిసరాలను పరిశుభ్రం చేయించారు. ప్రజలకు సంపూర్ణ పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ హేమలత, కమిషనర్ ఏ.వాణి, మేనేజర్ టి.పర్వతాలు, సీనియర్ అసిస్టెంట్లు మల్లేష్, జంగయ్య, వార్డు అధికారులు అశోక్, మహేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకులు సేవాభావంతో పని చేయాలి



బ్యాంకును ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ హేమలత

తుక్కుగూడ: బ్యాంకులు నిరుపేదలు, మధ్య తరగతి ప్రజలకు సూక్ష్మ రుణాలను అందజేసి, వారికి ఆర్థికంగా చేయూతను ఇవ్వాలని తుక్కుగూడ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ బరిగెల హేమలత సూచించారు. శనివారం పురపాలక కేంద్రంలోని ఆదర్శ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ 27వ శాఖను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బ్యాంకులు లాభాపేక్ష కోసమే కాకుండా సేవాభావంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ చైర్మన్ మదన గోపాల్‌స్వామి, మున్సిపల్ వైస్ చైర్మన్ బి.వెంకట్‌రెడ్డి, బ్యాంకు సిబ్బంది లక్ష్మీభారతి, విజయ, రాజుసాగర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్య వస్తే సతమతం

- ఎక్కడ ఫిర్యాదు చేయాలో తెలియక తుక్కుగూడ పురవాసుల అవస్థలు
- ప్రత్యేక పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని స్థానికుల డిమాండ్



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు (ఫైల్)

తుక్కుగూడ: దేశంలోనే పేరుగాంచిన రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి కూతవేటు దూరంలో ఉన్న తుక్కుగూడ మున్సిపాలిటీని ప్రత్యేక పోలీస్ స్టేషన్ సమస్య కొన్నాళ్లుగా వేధిస్తోంది. మున్సిపాలిటీ పరిధిలో శ్రీశైలం రహదారి, ఔటర్ రింగు రోడ్డు ఎగ్జిట్-14, ఫ్యాబ్‌సిటీ, హార్డ్‌వేరు పార్క్, మంఖాల్ పారిశ్రామికవాడ ఉండడంతో నిత్యం వాహనాలు, ప్రజల రాకపోకలు విపరీతంగా సాగుతుంటాయి. కానీ భద్రతాపరంగా ఠాణా లేకపోవడంతో స్థానికులు కలవరపడుతున్నారు. అన్ని సౌకర్యాలు ఉన్న తుక్కుగూడ కేంద్రంగా ప్రత్యేక పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఠాణా కోసం నిరీక్షణ

పట్టణీకరణ వేగంగా అభివృద్ధి చెందడానికి గత ప్రభుత్వం తుక్కుగూడను మున్సిపాలిటీగా ఏర్పాటు చేసింది. స్థానికంగా ప్రత్యేక ఠాణా కోసం మున్సిపాలిటీ ప్రజలు గత ఐదేళ్ల నుంచి ఎదురు చూస్తున్నారు. మున్సిపాలిటీలో ఉన్న తుక్కుగూడ, సర్దార్‌నగర్ పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధికి వస్తే, రావిర్యాల గ్రామం ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఆదిబట్ల ఠాణాలోకి వస్తుంది. మంఖాల్ గ్రామం సగ భాగం పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌కి వస్తే, మిగతా భాగం మహేశ్వరం ఠాణాలోకి వస్తుంది. మున్సిపాలిటీ ఉన్న మూడు ఊర్లు మూడు పోలీస్ స్టేషన్లు అన్నట్లుగా మారింది. ఇక్కడ ఏదైన ప్రమాదం జరిగినా ఏ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చే యాలో ప్రజలకు తెలియక ఇబ్బందులు పడుతున్నారు.

డీసీపీ భవనానికి శంకుస్థాపన

గతంలో మహేశ్వరం నియోజకవర్గం రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఎల్‌బీనగర్ డీసీపీ పరిధి, ఇబ్రహీంపట్నం ఏసీపీ పరిధిలోకి వచ్చేది. రెండేళ్ల కిందట ప్రభుత్వం మహేశ్వరానికి ప్రత్యేకంగా డీసీపీ, ఏసీపీ అధికారులను కేటాయించింది. ప్రస్తుతం రెండు అధికారుల కార్యాలయాలు తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో అద్దె భవనంలో కొనసాగుతున్నాయి. డీసీపీ నూతన భవనం నిర్మాణ పనులకు ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి డి.శ్రీధర్‌బాబు, స్థానిక ఎమ్మెల్యే పి.సబితారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. డీసీపీ, ఏసీపీ కార్యాలయాలు ఉన్నా తుక్కుగూడలో ప్రత్యేక పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి శ్రీధర్‌బాబును తుక్కుగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ బరిగెల హేమలత, కౌన్సిలర్లు విజ్ఞప్తి చేశారు.

> **ఠాణా ఏర్పాటు చేయాలి**
>
> తుక్కుగూడను మున్సిపాలిటీగా ఏర్పాటు చేసిన ప్రభుత్వం ప్రత్యేక పోలీస్ స్టేషన్‌ను మరిచింది. ఇందులో ఉన్న మూడు ఊర్లు మూడు పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తాయి. ఏదైనా సమస్య వస్తే ఎక్కడ ఫిర్యాదు చేయాలో తెలియక ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి ప్రత్యేక ఠాణా ఏర్పాటు చేయాలి.
>
> – హేమలత, చైర్‌పర్సన్, తుక్కుగూడ మున్సిపాలిటీ

మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత

డీఆర్‌డీఓ శ్రీలత



మహిళా సంఘం సభ్యులకు చెక్కు అందజేస్తున్న డీఆర్‌డీఓ శ్రీలత

మహేశ్వరం: మహిళలు డ్వాక్రా సంఘంలో రుణాలు తీసుకొని ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీఓ శ్రీలత పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామంలో ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో భాగంగా డ్వాక్రా మహిళ సంఘాలకు రూ.కోటి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు రుణాలు తీసుకొని సొంత అవసరాలకు ఉపయోగించకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ఆర్థికంగా ఎదగాలన్నారు. రుణాలు ఎవరికైతే అవసరం ఉంటుందో వారే తీసుకొని సక్రమంగా చెల్లించాలన్నారు. తీసుకున్న వాటితో వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మహేశ్వరం, తుమ్మలూరు గ్రామాల్లో పుట్టగొడుగుల తయారీ, కుట్టు మిషన్ శిక్షణ ప్రారంభిస్తామన్నారు. అంతకు ముందు గ్రామంలో ఇందిరా మహిళా శక్తిలో భాగంగా రూ.48 లక్షలతో 26 మంది సభ్యులు కోడి పిల్లల మదర్ యూనిట్‌ను నెలకొల్పారు. కార్యక్రమంలో మండల ఏపీఎం సత్యనారాయణ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కవిత, బ్యాంకు మేనేజర్ రాజేష్, సీసీలు వీరాంజనేయులు, గ్రామ సంఘం అధ్యక్షురాలు జ్యోతి, వీఓఏలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భగవద్గీత పోటీలు

కేశంపేట: గీత జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో శ్రీశ్రీ కిషన్ ప్రభు గీతా ప్రచార సమితి అధ్వర్యంలో ఉమ్మెంతల మహేశ్వర్ అధ్యక్షతన శనివారం భగవద్గీత పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రాథమిక స్థాయి విభాగంలో భగవద్గీత 12వ అధ్యాయంలోని భక్తి యోగంలోని పది శ్లోకాలు, ఉన్నత స్థాయి విభాగంలో 12వ అధ్యాయంలోని పూర్తి శ్లోకాలను కంఠస్థ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 44 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో ప్రాథమిక స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో అసియా బేగం, తేజశ్రీ, నిక్షిత (ఆదర్శ విద్యాలయం), ప్రోత్సాహక బహుమతిని లిఖిత (ఆర్‌వీ స్కూల్) విద్యార్థులు నిలిచారు. అదేవిధంగా ఉన్నత విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో వర్షిణి, శ్రీవర్ష (ఆదర్శ విద్యాలయం), తృతీయ స్థానంలో ప్రీతి (గ్లోబల్ స్కూల్) గెలుపొందారు. అనంతరం వీరందరికీ నిర్వాహకులు బహుమతులు, జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్‌లు తలసాని వెంకట్‌రెడ్డి, అమృతమ్మ, దేవాలయ కమిటీ చైర్మన్ మఠం శేఖరయ్య, తలసాని సుదర్శన్‌రెడ్డి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, రామకృష్ణ, రవీందర్, గీతా ప్రచార సమితి సభ్యులు రంగనాథ్, వెంకటేష్, చంద్రశేఖర్, కృష్ణయ్య, అయ్యప్పరెడ్డి పాల్గొన్నారు.



మానసిక దివ్యాంగులతో కలిసి సేవాభారతి అవార్డును చూపుతున్న గిరి

'మాతృదేవోభవ'కు అవార్డు

బడంగ్‌పేట్: హెవెన్ హోమ్స్ సొసైటీ 20వ వార్షికోత్సవం సందర్భంగా ఫౌండర్ జి.వరలక్ష్మి ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న ప్రముఖులను సన్మానించారు. అందులో భాగంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ వారి సౌజన్యంతో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో శనివారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ మాతృదేవోభవ అనాథ, మానసిక దివ్యాంగుల ఆశ్రమ నిర్వాహకులు గట్టు గిరికి సేవా భారత్ అవార్డు- 2024 అందజేశారు. సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా గట్టు గిరి, ఇందిర దంపతులు అందుకున్నారు. అనాథలు, మానసిక దివ్యాంగులను చేరదీసి వారికి మతి స్థిమితం వచ్చేలా చేసి కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్నారు. అనాథ శవాలకు అన్నీ తామై దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేయడం చాలా సంతోషంగా ఉందని గిరి అన్నారు. ఇప్పటివరకు 182 అవార్డులు అందుకున్నామన్నారు.

తులం బంగారం ఇవ్వాలి

- కల్యాణలక్ష్మి పథకంపై ప్రభుత్వ వైఖరి సరికాదు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి



బడంగ్‌పేట్: చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు



మీర్‌పేట: లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

బడంగ్‌పేట్: కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు అందజేసి చేతులు దులుపుకొంటే ఊరుకునే ప్రసక్తే లేదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ఆగ్రహించారు. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఆడబిడ్డకు తులం బంగారం అందజేయాలని డిమాండ్ చేశారు. శనివారం బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సబితారెడ్డి విచ్చేసి మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకు వచ్చారని గుర్తు చేశారు. అందులో భాగంగానే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం పురుడు పోసుకుందన్నారు. ఇంట్లో ఎదిగిన ఆడపిల్లకు పెళ్లి చేసి తల్లిదండ్రులు అప్పులపాలు కాకూడదనే ఉద్దేశంతో నాడు కేసీఆర్ ఈ పథకాన్ని తీసుకు వచ్చారన్నారు. పథకం కింద ఇచ్చే రూ.లక్షకు తోడుగా తులం బంగారం ఇస్తామని గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన మాటను కాంగ్రెస్ దమ్ముంటే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా 113 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మేయర్ చిగురింత పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ సరస్వతి, తహసీల్దార్ ఇందిరాదేవి, డిప్యూటీ తహసీల్దార్ మణిపాల్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

మీర్‌పేట: కల్యాణలక్ష్మి నగదుతో పాటు తులం బంగారం కూడా ఇవ్వాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు శనివారం మీర్‌పేట కార్పొరేషన్ కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. 70 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, ఐదుగురికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, తహసీల్దార్ ఇందిరాదేవి, కమిషనర్ జ్ఞానేశ్వర్, మేనేజర్ చంద్రప్రకాశ్‌రెడ్డి, ఆర్ఓ చంద్రశేఖర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మణిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు కృషి

- దొడ్డి కొమురయ్య భవన ప్రారంభోత్సవాన్ని విజయంతం చేయండి
- కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు దశరథ



సమావేశంలో పాల్గొన్న కురుమ సంఘం నాయకులు

మహేశ్వరం: దొడ్డి కొమురయ్య కురుమ భవన ప్రారంభోత్సవానికి ప్రతిఒక్కరూ హాజరు కావాలని కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్దాల దశరథ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బీరప్ప ఆలయం వద్ద కురుమ సంఘం మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కురుమలు ఐక్యంగా ఉండి వారి హక్కుల సాధనకు ఉద్యమించాలన్నారు. విద్య, రాజకీయ, ఆర్థిక, సామాజికంగా ఎదగాలని సూచించారు. ప్రభుత్వం కురుమల కోసం కోకాపేట్‌లో దొడ్డి కొమురయ్య భవనం నిర్మించడం అభినందనీయం. ఈ నెల 14న కురుమ భవన ప్రారంభోత్సవానికి ప్రతి కురుమ హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మహేశ్వరం, కందుకూరు మండలాల కురుమ సంఘం అధ్యక్షులు పెంటల రాయప్ప, ఎగ్గిడి సత్తయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ పోల్కం బాలయ్య, నాయకులు బాల్‌రాజ్, యాదగిరి, బాలయ్య, రవి, కిష్టయ్య, శ్రీశైలం, చంద్రయ్య, లక్ష్మయ్య, లింగం తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



లబ్ధిదారుకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు: నియోజకవర్గం పరిధిలో ఆపదలో ఉన్న వారిని తన వంతుగా ఆదుకునే ప్రయత్నం చేస్తున్నానని స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని అగర్‌మియాగూడకు చెందిన ఎ.బాలమ్మ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందగా, అందుకు అయిన ఖర్చులకు సంబంధించి స్థానిక నాయకుల ద్వారా ఎమ్మెల్యే సహకారంతో సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకుంది. దీంతో ఆమెకు రూ.22 వేలు మంజూరయ్యాయి. శనివారం లబ్ధిదారురాలికి ఎమ్మెల్యే సబితారెడ్డి చెక్కు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వడ్డేపల్లి రేవంత్ రెడ్డి, అండె నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత తప్పనిసరి

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ పనుల పరిశీలన



కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

షాద్‌నగర్‌రూరల్: నిరుపేద విద్యార్థులు చదువుకునేందుకు దాతల సహకారంతో చేపడుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనుల్లో తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. శనివారం పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాల శిథిలావస్థకు చేరుకోవడంతో దాతల సహకారంతో నూతన భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. భవన నిర్మాణంలో ఎక్కడా రాజీపడకుండా తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఖర్చుకు వెనుకాడకుండా క్వాలిటీ కలిగిన సామగ్రిని ఉపయోగించాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులను చేపట్టాలని, ఏమైనా సందేహాలు వస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కళాశాల నిర్మాణానికి దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి విరాళాలను అందజేయడం అభినందనీయమన్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్, నాయకులు రఘునాయక్, పురుషోత్తంరెడ్డి, రాజేశ్, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్

విద్యార్థులలో ఏదైనా సాధించాలనే కృషి, పట్టుదల ఉంటే విజయాలు వెన్నంటే ఉంటాయని, ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్‌లో ప్రజాపాలన విజయోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తిత్వ వికాస నిపుణుడు గంప నాగేశ్వర్‌రావు విద్యార్థులకు సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో వ్యక్తిత్వ వికాసంపై తల్లితండ్రులు, పిల్లలకు మధ్య అనుబంధం ఏ విధంగా ఉండాలి, చిల్డ్రన్స్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్, విద్యార్థుల చదువు, నైపుణ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని, లక్ష్య సాధనకు ప్రణాళికలను రూపొందించుకొని నిరంతరం ఆ దిశగా శ్రమిస్తే విజయ తీరాలకు చేరుకుంటారన్నారు. విద్యపైనే దృష్టి సారించాలని, వ్యసనాల జోలికి వెళ్లరాదని సూచించారు. తల్లితండ్రులు పెట్టుకున్న ఆశలను నెరవేర్చేందుకు ఉన్నత విద్యావంతులుగా ఎదగాలన్నారు. విద్యారంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకొని నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, కమిషనర్ వెంకన్న, కౌన్సిలర్లు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ నిర్మాణం అభినందనీయం

ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి



బస్‌షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, గ్రంథాలయ చైర్మన్, కుటుంబ సభ్యులు

షాబాద్: తన తండ్రి జ్ఞాపకార్థం మల్లీ మహేశ్, మధుకుమార్‌లు బస్‌షెల్టర్ నిర్మించడం అభినందనీయమని ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని నాగర్‌కుంట గ్రామంలో దైవాలగూడ చౌరస్తాలో అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్లీ మహేశ్, మల్లీ మధుకుమార్ తన తండ్రి మల్లీ జంగయ్య జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు సొంత ఖర్చులతో బస్‌షెల్టర్ నిర్మించారు. శనివారం ఎమ్మెల్యే, గ్రంథాలయ సంస్థ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి సమాజంలో తల్లిదండ్రులను సరిగా చూసుకోని తరుణంలో తల్లిదండ్రుల జ్ఞాపకార్థం బస్‌షెల్టర్ నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డు గ్రహీత మల్లీ వెంకటేశ్, నాయకులు రాహుల్‌గుప్తా, అన్వర్, చేవెళ్ల స్వామి, గ్రామస్తులు ఎండీ హైమద్, భాస్కర్, మల్లీ మల్లేశ్, బంగారు ఎల్లేశ్, సుందర్, లింగాల రమేశ్, పార్వతి విజయ్ తదితరులు ఉన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

కేశంపేట: సమగ్ర శిక్ష అభియాన్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ శనివారం మండల కేంద్రంలో తహసీల్దార్ అజాంఅలీ,ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, మండల విద్యాధికారి చంద్రశేఖర్‌కు వినతిపత్రాలు అందించారు. విద్యాశాఖలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న తమను పర్మినెంట్ చేయాలని వారు వినతిపత్రంలో కోరారు. సమగ్ర శిక్షలో రోస్టర్, మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్, రాత పరీక్ష ద్వారా ఎంపికైనట్లు తెలిపారు. తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేసేవరకు మినిమమ్ టైమ్ స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 10న మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా తమ హక్కుల సాధనకు సమ్మెకు వెళ్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని తెలిపారు.